క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

సాలూరు: మున్సిపాలిటీలోని వార్డుల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో శానిటరీ సెక్రటరీలు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటింటి చెత్త సేకరణ ప్రతి వార్డులో చేపట్టాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. రోడ్లు, కాలువల్లో విచ్చలవిడిగా చెత్త వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించేలా కోరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ రద్దుచేయాలి

పార్వతీపురంటౌన్: హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు విద్యాశాఖ విడతల వారీగా ఇస్తున్న శిక్షణను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కర్‌రావు అధికారులను డిమాండ్ చేశారు. హైస్కూల్స్, ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం ఆపార్, ఆధార్ కరెక్షన్, 10వ తరగతి నామినల్ రోల్స్, మెగా పేరెంట్స్ మీటింగ్, ఎఫ్ఏ-2 పరీక్షలతో తీవ్ర ఒత్తిడిలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులున్నారని దానికి తోడుగా లీడర్ షిప్ ట్రైనింగ్, ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ ఆరు రోజుల పాటు ఇస్తున్నారని, దీనివల్ల విద్యార్థులకు చదువు లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి జిల్లా అగిరిపల్లిలో జరుగుతున్న ట్రైనింగ్‌లో ఒక ప్రధానోపాధ్యాయుడు చరిపోయారని, వెంటనే ఈ శిక్షణ రద్దు చేయాలని లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురంటౌన్: నర్సిపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 8న 11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒ.గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఆర్ నగరం ఫీడర్‌ట్రీ కటింగ్, పోల్ లీనింగ్ ఉండడం వల్ల ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని తెలిపారు. వెంకంపేట, రావికోన, సంగంవలస, చిన్న బొండపల్లి, పెదమరికి, చిన్నమరికి, లక్ష్మీ నారాయణపురం, ఎమ్మార్‌నగరం, రంగాలగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరుతున్నా మన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు చర్యలు



పైపులైన్ ఏర్పాటుకు రోడ్డుపై ఉన్న కట్టడాలను తొలగించిన దృశ్యం

వీరఘట్టం: మండలంలోని కుమ్మరిగుంటలో జలజీవన్ మిషన్ పథకం కింద తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు గ్రామస్తులు తమ ఇళ్ల ముందు ఉన్న కట్టడాలను తొలగించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ మేరకు అధికారులు ఇళ్ల ముందు ఉన్న కట్టడాలను బుధవారం తొలగించారు. మురుగు కాలువల నిర్మాణం చేపట్టి, జలజీవన్ మిషన్ పైపులైన్లు ఏర్పాటు చేసే విధంగా రోడ్డుకు ఇరువైపులా 15 అడుగుల వరకు కట్టడాలను తొలగించారు. అయితే పైపు లైన్లు వేసేందుకు నిధులు ఉన్నప్పటికీ, కాలువల నిర్మాణానికి నిధులు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి చక్రధర్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

సీతంపేట: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. మండలంలోని కుడ్డపల్లి జంక్షన్ వద్ద ప్రజలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఆఫర్లు, లక్కీడ్రాల పేరుతో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అపరిచితులతో బ్యాంకు ఖాతా నంబరు, ఓటీపీ, పిన్ వివరాలు పంచుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.

బడిదేవరకొండపై

తవ్వకాలు ఆపాల్సిందే



పట్టణంలో పాదయాత్ర చేస్తున్న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు

- ప్రారంభమైన పరిరక్షణ కమిటీ పాదయాత్ర
- అడ్డుకున్న పోలీసులు

పార్వతీపురంటౌన్: బడిదేవరకొండ తవ్వకాలను ఆపాల్సిందేనంటూ బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని సుందరయ్య భవనం నుంచి బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిదేవరకొండ గిరిజన ప్రజలందరికీ అండగా నిలుస్తుందని, మనల్ని కాపాడే అమృత మూర్తిని తవ్వే హక్కు ఏ ఒక్కరికీ లేదన్నారు. కొండ తవ్వకాలకు మన ప్రాంతంతో సంబంధంలేని కొంతమంది పెత్తందారులు, భూస్వాములు, క్వారీ యజమానికి అనుమతుల లైసెన్స్ ఇవ్వడంతో ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కొండను తవ్వుకుపోవడం అన్యాయమని దీనిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

ఈ కొండ పార్వతీపురం మండలానికి జీవనాధారంగా నిలుస్తుందని, అది కొండ మాత్రమే కాదని వర్షించి మనకు సాగునీరిచ్చే అమ్మని, మనల్ని కాపాడే అమృత మూర్తిని కాపాడుకునే బాధ్యత స్థానిక ప్రజలు, గిరిజనులందరిదీ అని పిలుపునిచ్చారు. కొండ తవ్వకాలు అక్రమమని ఇటు అధికారులు, అటు ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకుంటున్నప్పటికీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో అనుమతులను రద్దు చేసిన ప్రభుత్వాలే ప్రస్తుతం అనుమతులు ఇవ్వడం విడ్డూరమన్నారు.



వెంకంపేట కూడలి వద్ద పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

పాదయాత్రకు ఆటంకం

బడిదేవరకొండపై తవ్వకాలకు ఇచ్చిన లీజు లైసెన్సులు రద్దు చేయనందున పరిరక్షణ కమిటీ పాదయాత్ర ప్రారంభించి వెంకంపేట గ్రామానికి చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా పాదయాత్రలకు అనుమతి లేదంటూ అడ్డుకోవడం అన్యాయమని పరిరక్షణ సమితి సభ్యులు ఈ సందర్భంగా అభ్యంతరం తెలిపారు. ఏదిఏమైనా పాదయాత్రను కొనసాగిస్తామని పరిరక్షణ కమిటీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.శ్రీనునాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.నర్సింగరావు, గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పి.రంజిత్ కుమార్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.విశ్వేశ్వరరావు, అఖిల భారత గ్రామీణ ఉపాధి కార్మిక సంఘం నేత సంగం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై సంతోషి

పార్వతీపురంటౌన్: చట్టాలపై అవగాహన తప్పనిసరని రూరల్ ఎస్సై సంతోషి అన్నారు. ఈ మేరకు నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఉచితంగా డబ్బు చెల్లిస్తామని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, ఆన్‌లైన్‌లో బహుమతులు, అపరిచితుల సెల్‌ఫోన్ మెసేజీలను నమ్మకూడదని, అనుమానిత లింకులను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదని చెప్పారు. విద్యార్థినులు తప్పనిసరిగా గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9.38 కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట: ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ బ్లాక్‌కు చెందిన మహిళ సుమితా పడాల్ నుంచి 9.38 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ, ఒడిశా నుంచి చాపరాయివలస మీదుగా విజయనగరంవైపు రెండు బ్యాగుల్లో ఆమె గంజాయి తరలిస్తుండగా చెక్‌పోస్టు సమీపంలో దుర్గ గుడి వద్ద పట్టుకున్నామని చెప్పారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించి కేసు నమోదుచేశామన్నారు.

రహదారి నిర్మించాలి

సీతంపేట: మండలంలోని పూతికవలస పంచాయతీ గూడంగి గ్రామానికి రహదారి నిర్మించాలని గిరిజన సంఘం నాయకులు బి.శ్రీరాములు, సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు గ్రామస్థాయిలో పరిశీలన చేయాలని కోరారు. గతంలో మండల స్థాయి సమావేశాల్లో కూడా రహదారి, మంచినీటి సౌకర్యం కల్పించాలని సర్పంచ్‌లు కోరినా పట్టించుకున్న వారు లేరన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



కార్తీక్

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి పరుగుపందెం పోటీలకు మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలురు పాఠశాలకు చెందిన విద్యార్థి మండంగి కార్తీక్ ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ఆర్ఎస్‌వీ ప్రసాదరావు, పీఈటీ టి.గోవిందరావులు బుధవారం తెలిపారు. ఏలూరులో గురువారం జరిగే పోటీలకు సదరు విద్యార్థి బుధవారం పయనం కాగా, పాఠశాల సిబ్బంది ఆల్‌ది బెస్ట్ చెప్పారు. ఇటీవల అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో జరిగిన 100 మీటర్ల పరుగు పందెంలో కార్తీక్ విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

బహుళ పంటలతో అధిక దిగుబడులు



సూచనలిస్తున్న రీజనల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంలో వరిపోలాల గట్లపై వేసిన బహుళ పంటలు అధిక దిగుబడులు ఇస్తాయని ప్రకృతివ్యవసాయం రీజనల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని మండకాలనీ, గొయిది ప్రాంతాల్లో వేసిన పంటలు బుధవారం ఆయన పరిశీలించారు. ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్ పంటలు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడి సాగు ఖర్చులు, ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రబీ సీజన్‌లో చేయాల్సిన కార్యక్రమాలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌టీవో హేమసుందర్, ఎన్ఎఫ్ఏ మునలయ్య, డివిజన్ ఇన్‌చార్జ్ బాలు, నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు గొరలి వెంకటరమణ కోరారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి నిరసన తెలిపి, రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018వ సంవత్సరానికి ముందు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు చెల్లించారని అక్కడి నుంచి పారిశుద్ధ్య కార్మికుల కంటే ఇంజినీరింగ్ కార్మికులకు తక్కువ జీతాలు చెల్లిస్తున్నారన్నారన్నారు. ప్రధానంగా సంక్షేమ పథకంలో సామాజిక భద్రత పింఛన్లు రద్దు చేశారన్నారు. నిత్యావసర ధరల రెట్లు పెరిగాయని, వాస్తవానికి ఇంజినీరింగ్ విభాగంలో పంప్ ఆపరేటర్స్, బోర్ మెకానిక్స్, డ్రైవర్స్, ఫిట్టర్స్, మెకానిక్, వెల్డర్స్, పెయింటర్స్, ప్లంబర్ పంక్చరింగ్, తదితర కేటగిరి కార్మికులకు జీఓ నంబర్ 11 ప్రకారం స్కిల్డ్ కార్మికులకు జీఓ నంబర్ ఏడు ప్రకారం రూ.21, 500 చెల్లించాలని గుర్తుచేశారు. హెల్పర్లకు రూ.18,500 చెల్లించాలని, ఇవేవీ అమలు కావడం లేదన్నారు. టౌన్ ప్లానింగ్‌లో కంప్యూటర్ ఆపరేటర్స్, వెటర్నరీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 10వ తేదీన విజయవాడలోని ఎంబీ విజ్ఞానకేంద్రం, రాఘవయ్యపార్క్ సమీపంలో జరుగుతున్న రాష్ట్ర సదస్సులో ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎ.తాతబాబు, ఎం.రమేష్, ఎస్.మధుసూదనరావు, పి.రమేష్, బి.ఉమ, పి.వాసుదేవరావు, ఎం.కృష్ణ, ఎం.రమేష్, ఎ.శంకరరావు, కె.నాగరాజు, బి.రమేష్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘానికి గుర్తింపు



వలలో పడిన చేపలను ఏవిధంగా ఏరాలో వివరిస్తున్న మత్స్యశాఖ అధికారులు

వీరఘట్టం: మండలంలోని పీవీఆర్‌పురంలో కొత్తగా ఏర్పాటైన మత్స్యకార సంఘానికి జిల్లా మత్స్యశాఖ అధికారులు బుధవారం నైపుణ్య పరీక్షలు నిర్వహించి ఆ సంఘానికి గుర్తింపు ఇచ్చారు. గ్రామానికి చెందిన 14 మంది మత్స్యకారులు శ్రీసింహాద్రి స్వదేశీ మత్స్యకార సంఘంగా ఏర్పాటయ్యారు. తమ సంఘానికి ప్రభుత్వ పరంగా గుర్తింపు ఇవ్వాలని కోరడంతో వారికి నైపుణ్య పరీక్ష నిర్వహించినట్లు మత్స్యశాఖ డివిజనల్ అధికారి డి.గోపీకృష్ణ తెలిపారు. వీరఘట్టం సమీపంలోని వెంకమ్మచెరువు వద్ద వారికి ఈత, చేపలు పట్టడం, వల విసరడం, వలలో పడిన చేపలను ఏరడం, వలను భద్రపరుచు విధానం, తదితర అంశాల్లో వారి నైపుణ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి వి.తిరుమలయ్య, సంతోష్‌కుమార్, వై.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక దృష్టి



విద్యార్థిని ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీపీవో జగన్మోహనరావు

గరుగుబిల్లి:

దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సహా అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. వెల్‌నెస్ కేంద్రానికి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు?.. వారు ఏయే సమస్యలతో బాధపడుతున్నారు వంటి విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీపీ, సుగర్, కేన్సర్, గుండెపోటు వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, పిల్లల ఆరోగ్యం, చదువుపై దృష్టిసారించాలని ఆదేశించారు. సామ్, మామ్‌గా గుర్తించిన పిల్లలకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన.. కిశోరి బాలికల హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులు, వారి ఆరోగ్య పరిస్థితులను రికార్డుల ఆధారంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాస్, కార్యాలయ ఈవో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పాపయ్య

- ఆటో డ్రైవర్లకు అవగాహన

పార్వతీపురంటౌన్: రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని పట్టణ ఎస్సై గోవింద్, ట్రాఫిక్ ఎస్సై పాపయ్యలు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రహదారి భద్రతపై ఆటో డ్రైవర్లకు బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు తప్పనిసరిగా రహదారి భద్రతా నియమాలు తెలిసి ఉండాలని సూచించారు. ఆటోలకు అన్ని అర్హత పత్రాలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఆటోలను క్రమపద్ధతిలో నిలపాలని, ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్, సౌందర్య జంక్షన్, బెలగాం వద్ద ఆటోలను అస్తవ్యస్తంగా నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించవద్దని, డ్రైవర్ సీటులో ప్రయాణికులను కూర్చోబెట్టవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

104 సిబ్బంది డిమాండ్లు పరిష్కరించాలి



డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయపార్వతికి వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

పార్వతీపురంటౌన్: ప్రభుత్వమే 104 సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు దుర్గాప్రసాద్ కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.విజయపార్వతిని, 104 జిల్లా నోడల్ అధికారి డాక్టర్. వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని కుటుంబాలను పోషించడం చాలా కష్టం అవుతోందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలని, ప్రభుత్వం నిర్వహించడం వల్ల కేవలం రూ.50 వేలు ఖర్చు మాత్రమే అయ్యి ప్రజా ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆనందరావు, ప్రసాదరావు జగదీష్, సంతోష్, తేజ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే



గంగాడ-వంతరాంల మధ్య రోడ్డుకు పడిన రంధ్రం

బలిజిపేట: మండలంలోని వంతరాం-గలావల్లి మార్గంలో ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గంగాడ నుంచి వంతరాం వైపు వస్తుండగా మార్గంలో రోడ్డుకు పక్కనే పెద్ద రంధ్రం ఉండడం ప్రమాదకరంగా కనిపిస్తోంది. రోడ్డంతా గుమ్ములు, గోతులుగా మారడంతో పాటు పక్కనే పెద్దపెద్ద రంధ్రాలు ఉండడంతో వాహనచోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రతిరోజూ ఈ రహదారిపై ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, లారీలు తిరుగుతూనే ఉంటాయి. ఈ రహదారి సింగిల్ రోడ్డు అవడంతో ఎదురుగా వచ్చే వాహనాలనుంచి తప్పించుకునేందుకు పక్కకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. రంధ్రాలను పూడ్చాలని, రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు మేలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేయాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. ఇదే విషయమై ఆమె కురుపాం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలతో బుధవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎక్కడైనా రాజకీయ పార్టీలు బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని తెలిపారు. అలాగే రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు పలువురి ఎంపిక



శిబిరంలో నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కొమరాడ: మండలంలోని పరశురాంపురంలో బుధవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో పలువురిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. శిబిరానికి హాజరైన వారి కళ్లను వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కెటరాక్ట్, కొయ్యకండ, గ్లకోమా వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ చేసిన తర్వాత కళ్లజోడు, మందులు కూడా అందజేయడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. అనంతరం నేత్రదానంపై అవగాహన కల్పించి, ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సుకుమార్‌బాబు, నేత్ర వైద్య సహాయకుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.